

నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు నిషేధం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

జిల్లాలో ఎక్కడైనా నది పరివాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలన్ని నిషేధించడమైనది జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ, జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలను ఆదాయం కోసం కాకుండా సులభంగా ఇసుక అందుబాటులో ఉంచడం ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. జిల్లాలో మూడు డిపోలలో, పట్టా శాండ్‌లో సుమారు 45,850 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉందని తెలిపారు. ఇసుక పంపిణీ నియంత్రించేందుకు రవాణా, గనుల, రెవెన్యూ శాఖా అధికారులు ప్రత్యేకచర్యలు చేపట్టవలసినదిగా ఆదేశించారు. గతంలో ఇసుక కాంట్రాక్టర్లు జరిపిన ఇసుక అక్రమ త్రవ్వకాల గురించి ఏపీ ఎస్ఏసి సంస్థ పంపించిన వివరాలను జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమీక్షించి తదుపరి చర్యలు తీసుకోవడానికి చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లాలో ఎక్కడైనా నది పరివాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకం నిషేధమని నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలను ఉపయోగించిన, అక్రమంగా పక్క రాష్ట్రాలకు తరలించినా, తనిఖీలు నిర్వహించి కఠినచర్యలు తీసుకోవాలని జిల్లా స్థాయి ఇసుక కమిటీ సభ్యులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. నాణ్యత పరిమాణం ధర, సమయం కీలక అంశాలుగా పర్యవేక్షణలో ఉన్నాయని తెలిపారు. అక్రమ కార్యకలాపాలను నివారించడానికి మైన్స్, పోలీస్ అధికారులకు కఠినంగా పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించబడ్డాయని తెలిపారు. జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, చిత్తూరు ఆర్‌డిఓ శ్రీనివాసులు, మైన్స్ డిడి సత్యనారాయణ, ఎస్ఈఆర్ డబ్ల్యూఎస్ విజయ్ కుమార్, ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, ఈఈ ఇరిగేషన్, డిడి గ్రౌండ్ వాటర్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

బాలికలతో అసభ్య ప్రవర్తన

కీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: విద్యాబుద్ధులు, నడవడిక నేర్పాల్సిన గురువు విద్యార్థినుల పాలిట కీచకుడిలా మారాడు. లైంగికంగా వేధించి క్షోభకు గురిచేశాడు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఉన్నతాధికారులు సదరు ఉపాధ్యాయుడిని విచారిస్తున్నారు. ఈ సంఘటన బైరెడ్డిపల్లి మండలం దేవదొడ్డి గ్రామపంచాయతీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. ఈ పాఠశాలలో ఉపాధ్యాయుడు డి.వెంకటేశ్వర్లు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, అసభ్య పదజాలంతో మాట్లాడుతున్నారని, విద్యార్థులను తాకుతూ లైగింక వేధింపులకు గురిచేశారని విద్యార్థినుల తల్లిదండ్రులు తెలిపారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు వంద మంది శుక్రవారం పాఠశాల వద్దకు చేరుకుని ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. గ్రామచైర్మన్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈవో 2 సుబ్రహ్మణ్యం వెంటనే పాఠశాలకు వద్దకు చేరుకుని విషయంపై ఆరా తీశారు. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. సదరు ఉపాధ్యాయుడిపై విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని విధుల నుంచి తొలగించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

పాఠశాల వద్ద గొడవ విషయం తెలుసుకున్న సిఐ పరశురాముడు తక్షణ సిబ్బందితో పాఠశాల వద్దకు చేరుకుని గ్రామస్తులను సముదాయించి ఉపాధ్యాయుడిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అలాగే జిల్లా జిసిడిఓ ఇంద్రాణి, డివైఈవో ఇందిర పాఠశాల వద్దకు చేరుకుని విద్యార్థినులతో వ్యక్తిగతంగా మాట్లాడి నివేదికను పై అధికారులతో తెలియజేస్తామని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి ఇకపై ఇటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా పర్యవేక్షిస్తామని, విద్యార్థినులకు న్యాయం చేస్తామని తెలిపారు.





పాఠశాల వద్ద విద్యార్థినుల తల్లిదండ్రులు, గ్రామస్తుల ఆందోళన, వారితో మాట్లాడుతున్న సిఐ, పోలీసులు

కిట్టు.. వాడితే ఒట్టు..!

- నీటి ప్రమాణాలు గాలికి వదిలిన అధికారులు
- కలుషిత నీటితో రోగాల బారిన పడుతున్న ప్రజలు



చెట్ల మధ్యలో సంవత్సరాలు తరబడి శుభ్రతకు నోచుకుని తాగునీటి ట్యాంకు

ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వాలు సచివాలయాలకు ప్రాథమిక నీటి నాణ్యత పరీక్ష కిట్లను అందజేశాయి. వాటిని పూర్తిస్థాయిలో వినియోగించక పోవడంతో వాటి కాలపరిమితి ముగిసిపోయింది. ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు చేసి ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యతను అధికారులు విస్మరించారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా లక్షలాది రూపాయల ప్రజాధనం వృధాగా మారింది. కలుషిత నీటితో మండల ప్రజలు రోగాల భారిన పడుతున్నారు.

ప్రజాశక్తి- పూతలపట్టు: క్షేత్రస్థాయిలో అధికారుల పనితీరు అత్యంత ఘోరంగా తయారైంది. పూతలపట్టు మండలంలో చాలావరకు ఇన్‌ఛార్జిల పాలన కొనసాగుతుండడంతో ప్రజలకు సరైన వసతులు, సౌకర్యాలు అందడం లేదు. ప్రస్తుతం వర్షాలు విస్తారంగా పడుతున్న నేపథ్యంలో ప్రజలు వివిధ రకాల విషజ్వరాల భారినపడి ఆర్థికంగా చిన్నాభిన్నమవుతున్నారు. గత రెండేళ్ల కిందట మండలానికి అందిన నీటి నాణ్యతను పరీక్షించే కిట్లను అధికారులు మూలన పడేశారు. ఒక్కో కిట్టు విలువ రూ.2,400 చొప్పున వెచ్చించారు. వీటిలో రసాయనాలు, ఔషధాల గడువు 2023 ఫిబ్రవరి నుంచి 2025 ఫిబ్రవరి వరకు ఉంది. వీటిని ఎలా వినియోగించాలో గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులకు శిక్షణ ఇచ్చారు. కిట్లు సరఫరా చేసిన అనంతరం వాడకంపై ఆర్డబ్ల్యూఎస్ అధికారులు కనీసం దృష్టి సారించలేదు.

మూలనపడ్డ నీటి పరీక్ష కిట్లు

గ్రామీణులు తాగే నీటిలో సంపూర్ణ కఠినత్వం క్లోరైడ్ నైట్రైడ్, ఫ్లోరైడ్ ఇనుము తదితర అంశాలపై ఎంత శాతం ఉందో గుర్తించడానికి పరీక్షలు చేయాల్సి ఉండగా.. చాలాచోట్ల ఇంజనీరింగ్ సహాయకులు చేయలేదు. నాణ్యత లేని నీరు తాగడంతో ప్రజలు టైఫాయిడ్, విరోచనాలు, కామర్ల భారిన పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో కొత్తనీరు వచ్చి చేరుతుంది.

శుభ్రతకు నోచుకొని తాగునీటి ట్యాంకులు..

మండల పరిధిలో ఉన్న వందలాది తాగునీటి ట్యాంకులు గత కొన్ని సంవత్సరాలుగా శుభ్రతకు నోచుకోలేదు. ఒకవైపు అధికారులు నీటి పరీక్షలు గాలికి వదిలేయగా.. మరోవైపు పంచాయతీ సిబ్బందికి తాగునీటి ట్యాంకులను పరిశుభ్రత చేయాలన్న ఉద్దేశమే కనిపించడం లేదు. దీంతో ప్రజలు కలుషిత తాగునీటిని తాగాల్సిన దుస్థితి. ప్రస్తుతం మండలంలో ప్రతి ఇంటిలోనూ జ్వరాలతో ప్రజలు విలవిలలాడుతున్నారు. ట్యాంకులపై ఉన్న చెట్ల ఆకులు, పక్షుల మలవిసర్జనలు ట్యాంకుల్లో కుళ్ళి దుర్వాసన కలిగిన నీరు సరఫరా అవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇన్చార్జీలతో ఇబ్బందులు..

ప్రజలకు నాణ్యమైన నీటిని అందించడంలో ప్రధాన భూమిక పోషించాల్సిన ఆర్డబ్ల్యూఎస్ అధికారి ఇన్చార్జి కావడంతో.. మండలంలో కనిపించడం లేదు. ఏవైనా సమావేశాలు ఉంటే తప్ప ఈయన దర్శనం దొరకని పరిస్థితి. అదేవిధంగా మరికొన్ని ప్రధానమైన శాఖల అధికారులు నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన పూతలపట్టు మండలానికి ఇన్చార్జీలుగా వ్యవహరిస్తున్నారు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఇటు ప్రజలు ఆ శాఖ సిబ్బంది ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి.

అభివృద్ధికి సహకరిస్తాం : ఎంపిపి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అశ్విని

మండల అభివృద్ధికి వైసిపి సంపూర్ణ సహకారం

యూరియాపై అపోహలు వద్దు : ఏవో

ప్రజాశక్తి- కుప్పం: సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని, అభివృద్ధికి వైసిపి సంపూర్ణ సహకార అందిస్తుందని, మండల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ అశ్విని పేర్కొన్నారు. కుప్పం మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ అశ్విని అధ్యక్షతన ఎంపీడీవో వెంకటేశ్వర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల తీరుతెన్నులతో పాటు ప్రజాసమస్యలను సుదీర్ఘంగా చర్చించారు. కుప్పం రెస్కో పరిధిలో లంచం ఇవ్వందే ఏ ఒక్క పని కావడం లేదంటూ అధికార పార్టీకి చెందిన సింగిల్ విండో ఛైర్మన్ కృష్ణమూర్తి మండిపడ్డారు. రెస్కోలో విద్యుత్ సర్వీస్, ట్రాన్స్ఫార్మర్లు కావాలన్నా డబ్బులు ఇవ్వాల్సిన దుస్థితి నెలకొందని అవినీతికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. యూరియా విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రైతులకు అవసరమైన యూరియాని ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా అందజేస్తుందని అగ్రికల్చర్ ఏవో ఫయాజ్ పేర్కొన్నారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులు చర్చించారు. అభివృద్ధికి ఏనాడూ అడ్డుపడమని అయితే ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీపీ అశ్విని పేర్కొన్నారు. మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. జడ్పిటిసి శరవణ, సింగల్ విండో ఛైర్మన్ కృష్ణమూర్తి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

తాగునీటి సమస్య పరిష్కారం




ప్రజాశక్తి- విజయపురం: మండలంలో తాగునీరు కట..కట.. అనే శీర్షిక ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు స్పందన వచ్చింది. శుక్రవారం ఆర్డబ్ల్యూఎస్ ఏఈ గిరీష్ స్పందించి కేశవపురం గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టారు. పైపులైన్లు మరమ్మతులను కూడా చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు ప్రజాశక్తికి ధన్యవాదాలు తెలిపారు.

ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌పై శిక్షణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మాంజలి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాలోని ఏరియా ఆసుపత్రులు, సిహెచ్‌సిల వైద్యులు, స్టాఫ్ నర్స్‌లకు, ఫార్మసిస్టులకు, ల్యాబ్ టెక్నీషియన్లకు జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమంపై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా డిసిహెచ్ఎస్ మాట్లాడుతూ ప్రజలందరూ తప్పనిసరిగా అభ ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ ఐడి క్రియేట్ చేసుకోవాలని, తద్వారా ఆరోగ్య సంరక్షణ సేవలు ఆన్లైన్ ద్వారా నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రస్తుతం కుప్పంలో డిజిటల్ నర్వ్ సెంటర్ నడుస్తుందని, అలాగే చిత్తూరులో కూడా ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో స్టేట్ ప్రోగ్రాం అధికారి సుశీల, తదితరులు పాల్గొన్నారు.

కళా ఉత్సవ్ రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కార్వేటినగరం డైట్ కాలేజీలో జరిగిన జిల్లాస్థాయి కళా ఉత్సవ పోటీల్లో స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అన్ని విభాగాలలో పాల్గొన్నారు. ఇందులో 2డి డ్రాయింగ్ ఎస్.మితేష్ పదవ తరగతి విద్యార్థి, వాయిద్యం జంబు సి.మల్లేష్ కుమార్ తొమ్మిదవ తరగతి విద్యార్థి ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ పోటీలకు ఎంపిక కావడం జరిగింది. జిల్లా స్థాయిలో బహుమతులు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.పాపయ్యను ప్రత్యేకంగా అభినందించారు.

పేదలకు విద్య, వైద్యం దూరం చేసేందుకు కుట్ర

బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తమ సామాజిక వర్గం అభివృద్ధి, లంచాల కోసమే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు పబ్లిక్, ప్రైవేట్, పార్ట్నర్షిప్ (పిపిపి) విధానాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెరపైకి తీసుకొచ్చారని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర కార్యదర్శి కే ప్రభాకర్ ఆరోపించారు.శుక్రవారం స్థానిక బిఎస్పీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రబాబు అధ్యక్షతన ఆ పార్టీ ముఖ్యనాయకుల అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. కూటమి సర్కార్ ఎత్తుగడను గమనిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు వైద్య, విద్యను దూరం చేసే విధంగా కుట్రలు సాగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్ర సర్కార్ తీరుతో ఆయా సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులు వైద్య, విద్యకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని ప్రభుత్వ రంగాలను బడా ప్రైవేటు వ్యక్తులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్న కూటమి సర్కారు నేడు మెడికల్ కళాశాలలు, మెడికల్ సీట్లను సైతం అమ్ముకొనే పనిలో పడిందని ధ్వజమెత్తారు. జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రబాబు, నాయకులు పాల్గొన్నారు.

పెన్షన్‌ల తగ్గింపు, తొలగింపుపై ఆందోళన వద్దు

ప్రత్యేక వైద్యబృందాల ద్వారా ఆరోగ్య పరీక్షలు: కలెక్టర్



వికలాంగులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతులు, ప్రతి ఒక్కరికి ఎన్టీఆర్ సామాజిక భద్రత పెన్షన్ అందజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన దివ్యాంగులకు గ్రీవెన్స్ నిర్వహించారు, ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ శ్రీదేవి, డిఎం అండ్‌హెచ్ఓ సుధారాణి, డిసిహెచ్ఓ డాక్టర్ పద్మాంజలి పాల్గొన్నారు. కొందరు దివ్యాంగులు మాట్లాడుతూ అన్ని అర్హతలు ఉన్నప్పటికీ వికలాంగులం కాదని అనర్హత వేటు వేయడం జరిగిందని, శారీరక వైకల్యం ఉన్నప్పటికీ గంటలకు కొద్ది వెరిఫికేషన్ ప్రక్రియ వైద్యబృందం చేపట్టడం జరిగిందని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ పూర్తిగా వికలాంగులకు ఇచ్చే పింఛన్ రూ.5 వేలు నుండి రూ.15వేలకి పెంపు జరిగిందని తెలిపారు. త్వరలో రీ అసైస్మెంట్ కేంద్రాల ద్వారా ప్రత్యేక వైద్యబృందాల ద్వారా ఆరోగ్య పింఛన్లను పింఛనుదారులు సదరన్ క్యాంపు ద్వారా జిల్లాలో వికలాంగుల పెన్షన్లకు సంబంధించిన కార్యక్రమం చేపట్టడం జరుగుతున్నదని, అందులో భాగంగా పెన్షన్‌దారుల వివరాలను అర్హతను పరిశీలించడం జరుగుతున్నదని తెలిపారు. అనంతరం మీడియా ప్రతినిధులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి అసెస్మెంట్ సెంటర్ ద్వారా డిఆర్‌డిఏ సిబ్బంది, ఫోటోగ్రాఫర్, వీడియో గ్రాఫర్ కచ్చితంగా ఉండే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. వికలాంగుల పెన్షన్‌ల తగ్గింపు, తొలగింపుపై ఆందోళన చెందవద్దు అని, రీ అసెస్మెంట్ ద్వారా అర్హతను నిర్ధారించడం జరుగుతుందని, రీ అసెస్మెంట్‌కు సుమారు 4వేల దరఖాస్తుల స్వీకరణ గత నెల వికలాంగుల పెన్షన్ అర్హతపై అసెస్మెంట్ నిర్వహించి అర్హత లేని వారికి నోటీస్‌లు ఇవ్వడం జరిగిందని తెలిపారు. అర్హత కలిగి ఉండి పెన్షన్ కోల్పోయారని, మరొక సారి పరిశీలించాలని వికలాంగుల అసోసియేషన్ వారు కోరారని, ఆ మేరకు రీ అసెస్మెంట్ చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి ప్రత్యేక గ్రీవెన్స్ ద్వారా సుమారు 4వేల మంది దరఖాస్తులు సమర్పించారన్నారు. వారందరికీ రీ అసెస్మెంట్ సెంటర్‌లో అర్హత పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఒక్కొక సెంటర్‌లో డిఆర్‌డిఏ నుండి ఒక అధికారిని నియమిస్తామన్నారు. అర్హత పరీక్షల్లో అవకతవకలు జరుగుతున్నదని వచ్చిన ఫిర్యాదుల మేరకు పారదర్శకంగా నిర్వహించడానికి డాక్టర్‌తో పాటు ఆసుపత్రి సూపరింటెండెంట్ కూడా ధృవీకరణ పత్రంపై సంతకాలు చేస్తారన్నారు. అంగవైకల్యం ఉన్న శాతం ప్రకారం వికలాంగులకు శాతం నిర్ధారించడం జరుగుతుందన్నారు. అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతులు కలవర పడవద్దని నిజమైన అర్హత ఉన్న వారికి ప్రభుత్వ నిబంధనల మేరకు పెన్షన్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

ద్రావిడ విశ్వవిద్యాలయంలో

ఇంజనీరింగ్ కళాశాల భవనం ప్రారంభం

ప్రజాశక్తి- గుడిపల్లి: స్థానిక ద్రావిడ విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలను శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. శుక్రవారం ప్రభుత్వ విఫ్, ఎమ్మెల్సీ శ్రీ కంచెర్ల శ్రీకాంత్, విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యం.దొరస్వామి వర్సిటీలో ఇంజనీరింగ్ కళాశాల భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఇంజనీరింగ్ కళాశాల తరగతి గదులు, సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. వర్సిటీ శ్రీకందుకూరి వీరేశలింగం పంతులు ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభోత్సవ సభలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలను ప్రారంభించడం ఒక చరిత్ర అని కొనియాడారు. ఎన్‌టిఆర్ మానసపుత్రిక అయిన ద్రావిడ విశ్వవిద్యాలయాన్ని అన్ని విధాలా ప్రక్షాళణ చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. వర్సిటీకి ఇచ్చిన హామీ మేరకు నేడు ఇంజనీరింగ్ కళశాలను రెండు కోర్సులతో ప్రారంభించి 120 సీట్లను కేటాయించడం జరిగిందన్నారు. రాబోయే కాలంలో వర్సిటీలో 2000మంది ఇంజనీరింగ్ విద్యార్థులు విద్యనభ్యసించేలా చూస్తామన్నారు. అదేవిధంగా వర్సిటీలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపామన్నారు. వర్సిటీ ప్రతిష్ట దెబ్బతీసే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే అలాంటి వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వర్సిటీ అభివృద్ధికి ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహాయ సహకారాలు ఉంటాయని, బోధన, బోధనేతర సిబ్బంది కలిసి కష్టపడి పనిచేసి వర్సిటీని అభివృద్ధి చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వీసీ దొరస్వామి మాట్లాడుతూ అతి త్వరలోనే వర్సిటీకి చిత్తూరు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలలను అనుబంధం చేసే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఇంజనీరింగ్ కళాశాలకు సంబంధించి అధ్యాపకులను నియమించుకోవడం జరిగిందన్నారు. వర్సిటీ అభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామన్నారు. వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యనభ్యసించే ప్రతి ఒక్కరికి ఉద్యోగ కల్పన దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఏపిఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పి.ఎస్.మునిరత్నం, కుప్పం, పలమనేరు, మదనపల్లె అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కమిటీ ఛైర్మన్ డాక్టర్ బిఆర్.సురేష్ బాబు, ఆప్ వైడ్ ఛైర్మన్ రాజశేఖర్, టిటిడి బోర్డు సభ్యులు వైద్యం శాంతారాం, రిజిస్ట్రార్ ఆచార్య వి.కిరణ్ కుమార్, డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య కె.శ్యామల, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, ఏఎంసీ ఛైర్మన్ రాజు పాల్గొన్నారు



ఇంజనీరింగ్ కళాశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మేయర్, కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అధికారులు ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మేయర్ ఎస్.అముద తెలిపారు. శుక్రవారం లక్ష్మీనగర్ కాలనీ ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ కార్యాలయంలోని ప్రజాదర్బార్‌లో 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజలు సమర్పించిన వినతులను కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ పరిశీలించారు. సంబంధిత అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. నాన్ ఫైనాన్షియల్ సమస్యలను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఆర్థిక పరమైన సమస్యలకు సంబంధించి సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి నివేదికలు ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో మొత్తం 25 వినతులు అందాయి. డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, చిత్తూరు రూరల్ ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఎంహెచ్వో డాక్టర్ పి.లోకేష్, డీటీ ఇబ్రహీం, హౌసింగ్ డీఈ శ్రీధర్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజులు, టౌన్‌బ్యాంక్ ఛైర్మన్ కె.రమేష్ నాయుడు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంకు

ఎలక్ట్రిక్ బ్యాటరీ వాహనం విరాళం



ప్రజాశక్తి- ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంకు కెనరా బ్యాంకు సౌజన్యంతో సుమారు రూ.5,50,000లు విలువ గల ఎలక్ట్రికల్ బ్యాటరీ వాహనం విరాళం అందించారు. శుక్రవారం కెనరా బ్యాంకు వారు ఆలయానికి విచ్చేసి వికలాంగులకు, వృద్ధుల సౌకర్యార్థం ఈ వివాహనాన్ని వినియోగించాలని డీఈఓ సాగర్ బాబుని కోరారు. కార్యక్రమంలో ఏఈఓలు రవీంద్రబాబు, ప్రసాద్, సిఎఫ్ఓ నాగేశ్వరరావు, చీఫ్ జనరల్ మేనేజర్ అనురాధ, జనరల్ మేనేజర్ పాండురంగ, డిప్యూటీ జనరల్ మేనేజర్ రామ్మోహన్, పట్నం కెనరా బ్యాంక్ మేనేజర్ జయశ్రీ పాల్గొన్నారు.

16 నుండి మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి- కుప్పం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 బాల బాలికలకు ఈనెల 16 నుండి రెండు రోజులపాటు క్రీడాపోటీలు, సెలక్షన్ నిర్వహించడం జరుగుతుందని ఎంఈఓలు కుమారి, రాజారాం తెలిపారు. ద్రవిడ వర్సిటీ ప్రాంగణంలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, యోగ, చెస్, బ్యాట్మింటన్ క్రీడలకు సంబంధించి కుప్పం మండలంలోని ప్రభుత్వ ఎయిడెడ్ ఏపీ మోడల్ స్కూల్ గురుకులం కేజీబీవీ ప్రైవేటు ఇతర పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు పాల్గొనవచ్చు అని తెలిపారు.

కుక్క కాటు.. వ్యక్తికి గాయాలు


కుక్కకాటుతో గాయపడ్డ వెంకటరమణారెడ్డి

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని గంగి నాయనపల్లిలో కుక్క కాటుకు ఓ వ్యక్తి గాయ పడ్డాడు. గంగి నాయన పల్లి గ్రామానికి చెందిన వెంకటరమణారెడ్డి పనుల నిమిత్తం బయటకు వెళ్లాడు. ఓ ఇంటి వద్ద నిల్చున్న వీధి కుక్క ఆకస్మికంగా దూసుకు వచ్చి మీద పడి దాడి చేసి కాళ్లపై గాయం చేసింది. గాయపడ్డ వెంకటరమణారెడ్డిని వెంటనే గ్రామ స్తులు వైద్య చికిత్స నిమిత్తం బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. డాక్టర్ విజయ్ చంద్ర పరిశీలించి అతని పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో వీధి కుక్కలు అధికంగా తిరుగు తున్నాయని ఇలాంటి ఘటనలు తరచూ చోటు చేసు కుంటున్నాయని వారు పేర్కొన్నారు. తక్షణం వీధుల్లో కుక్కలు సంచరించకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి- కార్వేటినగరం: ఈ నెల 14వ తేదీ జాతీయ భాషా హిందీ దినోత్సవం పురస్కరించుకుని డీఎంపురం ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ప్రధానోపాధ్యాయులు నాథమని రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయిని మాలతి హిందీ భాష ఆవశ్యకతను, ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థినివిద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో హిందీ భాష ఆవశ్యకతపై వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. విద్యార్థులు హిందీ దివస్ స్వర వర్ణమాల వృక్షాన్ని చిత్రించి రంగులతో అలంకరించి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయిని మాలతి, బొజ్జా రాములు, ఢిల్లీ బాబు, రంజిత్ కుమార్, రాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేదు..

జీడీ నెల్లూరు సింగిల్ విండో అధ్యక్షుడు మోహన్ నాయుడు


ఎరువులు పంపిణీ చేస్తున్న మోహన్‌నాయుడు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండల రైతులకు ఎరువు లు కొరత లేకుండా సకా లంలో పంపిణీ చేస్తా మని సింగిల్ విండో అధ్యక్షుడు మోహన్ నాయుడు పేర్కొ న్నారు. శుక్రవారం సింగిల్ విండో వ్యవసాయ కార్యాలయంలో ఆయన రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 300 బస్తాలు యూరియా అందుబాటులో ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో విజయ్ కుమార్ రెడ్డి, టిడిపి జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవ సుందరం, సింగల్ విండో డైరెక్టర్ జ్యోతి యాదవ్, నియోజకవర్గ టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి గోపి, టిడిపి నాయకులు సోమశేఖర్ నాయుడు, సింగిల్ విండో సిబ్బంది మునస్వామి, బాబు, హరి, పలువురు రైతులు నాయకులు పాల్గొన్నారు.

రైతులకు రుణాలు మంజూరు

చైర్ పర్సన్ చిత్రా నాయుడు



రుణాలు అందిస్తున్న చిత్రానాయుడు

ప్రజాశక్తి - యాదమరి: యాదమరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేస్తున్నట్లు చైర్ పర్సన్ చిత్రా నాయుడు తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని సహకార సంఘంలో12 కమ్మపల్లి గ్రామానికి చెందిన ఎస్ లక్ష్మి కుటుంబానికి రూరల్ హౌసింగ్ మార్ట్ గేజ్ లోన్ ఐదు లక్షల రూపాయలు రుణం మంజూరు చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ చిత్ర మాట్లాడుతూ రైతులకు పంట రుణాలు, రూరల్ హౌస్ మార్ట్‌గేజ్ ద్వారా ఐదు లక్షల రూపాయల వరకు సహకార సంఘం ద్వారా ఇస్తామన్నారు . గతంలో తీసుకుని వాయిదా దాటిన రుణాలు సక్రమంగా చెల్లించి సంఘ అభివృద్ధికి రైతులు సహకరించాలని తెలిపారు. కమ్మపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీకి ఇంటి తనఖా రుణం కింద మంజూరైన చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆర్ గుణశేఖర్, యాదమరి పిఎసిఎస్ డైరెక్టర్లు మహబూబ్ బాషా, ప్రభాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

బకాయి డీఏలు విడుదల చేయాలి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: బకాయిలు ఉన్న డి ఏ లను విడుదల చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు గోపినాథ్ అన్నారు. శుక్రవారం మండల తహశీల్దారు కార్యాలయం ఆవరణంలో ఏపిటిఎఫ్ మండల అధ్యక్షులు మురళీకృష్ణ ఆధ్వర్యంలో శనివారం నిరస వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షులు గోపీనాథ్ మాట్లాడుతూ ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ఉపాధ్యాయ అపరిష్కృత సమస్యల పై పోరాటంలో భాగంగా పెండింగ్ డిఎల విడుదల , తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహశీల్దారు కు వినతిపత్రం అందించారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నవీన్ కుమార్ ఏపిటి ఎఫ్ సభ్యులు వాసు దేవయ్య ,చిరంజీవి ,శ్రీనివాసులు, రామకృష్ణ ,సునీత ,మొగిలయ్య, ఇబ్రహీం ,ఉష , నాసిర్ బాష, ధనలక్ష్మి , వంశీకృష్ణ పాల్గొన్నారు.

సింగిల్ విండోలకు యూరియా అందించాలి



ప్రజాశక్తి- రామకుప్పం: కుప్పం నియోజకవర్గంలోని వ్యవసాయ సహకార సంఘాల(సింగిల్ విండో సొసైటీల)కు యూరియాను అందించాలని సొసైటీ చైర్మన్లు మహమ్మద్ రఫీ, గోపాల్ ,రమేష్ జిల్లా వ్యవసాయశాఖ జెడి మురళి కృష్ణకు శుక్రవారం వినతి పత్రం అందించారు. రైతు సేవా కేంద్రాల్లో సైతం యూరియా, ఇతర ఎరువులను నేరుగా రైతులకు అందించేందుకు వెసులుబాటు కల్పించాలన్నారు. దీంతో ఆయన స్పందించి సొసైటీలకు ఎరువులు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు.

సమస్యలు అధికం..

- జెడ్‌పి ఉన్నత పాఠశాల అభివృద్ధిని పట్టించుకోని ఉన్నతాధికారులు
- ఆందోళనలో విద్యార్థులు


అపరిశుభ్రంగా వున్న తాగునీటి ట్యాంకు


కుక్కల మధ్యే భోజనాలు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కడప నత్తంలో అనేక సమస్యలు తిష్టవేశాయి. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం, అభివృద్ధి కమిటీ సభ్యుల మాటలు హెచ్‌ఎం లెక్కచేయపోవడం వంటి కారణాల వల్ల పాఠశాల సమస్యలు పరిష్కారం కాలేదని పలువురు పేర్కొంటున్నారు.

వీధి కుక్కల బెడద

ప్రహరీ గోడ లోపలే విద్యార్థులు మధ్యాహ్న భోజనం భుజిస్తున్న సమయంలో వీధి కుక్కలు విద్యార్థుల మధ్యలో ఇటు అటు దాటుకుని వెళుతున్నా ఉపాధ్యాయులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. దీనిపై గ్రామస్తులు మాట్లాడుతూ కుక్కల వల్ల పిల్లలకు ఏమైనా ప్రమాదం జరిగితే పాఠశాల ఉపాధ్యాయులే బాధ్యత వహించాలన్నారు.

కానరాని పరిశుభ్రత

పాఠశాల పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత లోపం కనిపిస్తోంది. పిల్లలు ఉపయోగించే మరుగుదొడ్లు దీనస్థితిలో, విద్యార్థిని విద్యార్థులకు వేరే మరుగుదొడ్లు కేటాయించారు. టీచర్లకు ఉన్న మరుగుదొడ్లు వారి పర్యవేక్షణ ఉంచుకుంటూ తాళం వేశారు. విద్యార్థినివిద్యార్థుల మరుగుదొడ్లు మాత్రం పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో శుభ్రత కరువైందని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల కమిటీ మెంబర్లను విచారణ కోరగా తమకు ఏమీ తెలియకనే అన్ని పనులు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఆమెకు తోచిన విధంగా పనులు నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకంపై విచారణ కోరగా తమకు కోడిగుడ్లు కూడా వలిచి పెట్టరని, తాగునీటి సమస్య ఉందని పాఠశాలలో ఉన్న తాగునీటి ట్యాంకర్లను పరిశీలించగా తీవ్రమైన చిత్తు కాగితాలు , కవర్లు ట్యాంక్ నీళ్లలో దర్శనమిచ్చున్నాయని తెలిపారు. దీనిపై ప్రధానోపాధ్యాయురాలును విచారణ కోరగా పాఠశాల ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను వెంటనే తొలగిస్తామని, ట్యాంకులను శుభ్రంచేయిస్తామని ఆమె తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఎల్‌డీవో



ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని పలమనేరు డిఎల్‌డివో (డివిజన్ లెవల్ డెవలప్ మెంట్ ఆఫీసర్) కె రామచంద్ర శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు.తిరుపతి ఎంపీడీవో గా పని చేస్తున్న ఈయన ఉద్యోగోన్నతిపై డిఎల్‌డివో గా జిల్లాకు బదిలీపై వచ్చారు. దీంతో మొదటి సారి నియోజకవర్గ అభివృద్ధి పనుల సమీక్ష కోసం వచ్చిన ఆయన స్థానిక టిడిపి కార్యా లయంలో ఎమ్మెల్యే కు పుష్పగుచ్ఛం అందించి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలమనేరు పట్టణంలో డిఎల్‌డివో కార్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకుని త్వరగా పనులు నిర్వహిం చాలని ఎమ్మెల్యే ఆదేశించడంతో పాటు పలు అంశాలపై వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో పెద్ద పంజాణి ఎంపిడివో బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

రవికుమార్ రాజు సేవలు ఆదర్శనీయం


రవికుమార్‌రాజును సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- కార్వేటినగరం : రవికుమార్ రాజు సేవలు ఆదర్శనీ యమని పలులు పేర్కొ న్నారు. కేఎం పురం ఆదర్శ ప్రాథమిక పాఠశాల లోని విద్యార్థుల భోజన శాలకు సుమా రు 50 వేల రూపాయలు విలువ చేసే రేకుల షెడ్డు, ఫ్యాన్లను కేఎం పురం గ్రామస్తులు భూపతిరాజు కుమారులు రవికుమార్ రాజు శుక్రవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కే చలపతిరావు ఏర్పాటు చేసిన సన్మాన సభకు హాజరైన మండల ఎంఈవో విజయకుమార్ మాట్లాడుతూ ఇలాంటి సేవా భావం కలిగిన వ్యక్తులు సమాజంలో చాలా అరుదుగా కనిపిస్తారని అలాంటి వ్యక్తుల్లో రవికుమార్‌రాజు ఒకరని కొనియాడారు. రవి కుమార్ మాట్లాడుతూ తమ గ్రామంలో ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయడం అదృష్టంగా భావిస్తున్నామని ఇలాంటి పాఠశాల అభివృద్ధిలో భాగస్వామి కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ సురేష్, గ్రామస్తులు ఓం ప్రకాష్, విజయులు రెడ్డి, దక్షిణామూర్తి, గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవిపై జాగ్రత్తగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: హెచ్‌ఐవి మహమ్మారిపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని హెచ్‌ఐవి ప్రాజెక్ట్ మేనేజర్ సద్దాం అన్నారు. మండలంలోని పివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్‌ఐవిపై శుక్రవారం అవగాహన సదస్సు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఐవి సోకిన వ్యక్తులు సమీపంలోని ఐసిటిఎస్ కేంద్రంలో పరీక్షలు చేసుకుని తగిన మందులు వాడతే జీవిత ప్రమాణం పెరుగు తుందని ప్రతి ఒక్కరూ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. హెచ్‌ఐవి సోకిన వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు సరఫరా చేస్తుందని హెచ్‌ఐవి బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో అవుట్ రిచ్ జెడి ద్రాక్షాయని, ఆర్ రెడ్డి ప్రసన్న, అధ్యాపకులు మురళీకృష్ణ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కార్వేటినగరం విద్యార్థులకు ప్రథమ బహుమతి


బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి -కార్వేటినగరం : కార్వేటి నగరం డైట్ లో ఈ నెల 11, 12వ తేదీల్లో నిర్వహించిన కళ ఉత్సవంలో నాదస్వరంలో జిల్లా పరిషత్ బాలికల ప్లస్ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో మొదటి బహుమతి అందుకున్నారు. విద్యార్థులు రిషిత, నాగ దీపిక, వైశాలి, భవానిలు ప్రథమ బహుమతి అందుకొని రాష్ట్ర స్థాయిలో నిర్వహించే కళా ఉత్సవం పోటీలకు అర్హత సాధించారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మర్రి శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్లు కే వేణుగోపాల్, డి కన్నయ్య, చిత్ర, జయదేవ్ లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -కార్వేటినగరం: కార్వేటినగరం డివిజన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏడీఈ తెలిపారు. శుక్రవారం ఏడీఈ విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని శ్రీరంగరాజపురం, వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల్లోని సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. విద్యుత్ వినియోగ దారులు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని కోరారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం: సిడిపిఓ


మాట్లాడుతున్న సీడిపివో వినతశ్రీ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సిడిపిఓ వినత శ్రీ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికల అవగాహన సదస్సు సూపరువైజరు కవిత ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ వినత శ్రీ మాట్లాడుతూ కిశోర బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ విద్యపై దృఢ సంకల్పంతో ఉండాలని, గుడ్ టచ్ బాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల యువతి ఎదుగుదలకు నోచుకోదని మొబైల్ ఫోన్లను అవసరం మేర వాడాలని తద్వారా సైబర్ నేరాలకు దూరంగా వుండవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు జనార్ధన్ రెడ్డి, సూపరువైజర్లు సరళ , మురళి, రాజేంద్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు రత్నకుమారి, జానకి, విజయ్ కుమారి, సుజాత, పలువులు కిశోర బాలికలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం


ప్రధానోపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ మేటి మంద ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన లత, అమృతలను విద్యార్థులు , మధ్యాహ్న భోజన నిర్వాహకులు, అంగన్‌వాడీ టీచర్, ఆయా విద్యార్థులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎనిమిది సంవత్సరాలుగా అటవీ ప్రాంతంలో ఉన్న మేటి మంద గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేస్తూ లత తమ గ్రామంలో ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. గతంలో తమ పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయురాలు అమృతను మధ్యాహ్న భోజన నిర్వాహకులు జయమ్మ, మహాలక్ష్మమ్మ, అంగన్‌వాడీ టీచర్ దీక్షావాణి, స్కూలు అభివృద్ధి కమిటీ చైర్మన్ ఇబ్రహీం, నూతన ఉపాధ్యాయుడు వెంకటరమణ, 17 మంది విద్యార్థులు ఘనంగా సన్మానించి కేక్ కట్ చేసి ఉపాధ్యాయులకు తినిపించి గురుభక్తిని చాటుకున్నారు. అనంతరం పిల్లలు తాము దాచిన పొదుపు డబ్బుతో ఉపాధ్యాయులకు బహుమతులు అందించారు.

హాస్టళ్ల ఏర్పాటుకు స్థలాలు గుర్తించండి

అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ప్రజాశక్తి- పలమనేరు: ప్రభుత్వం తరపున మంజూరైన ఎస్‌సి కళాశాల బాలికల, ఎస్‌సి కళాశాల బాలికల హాస్టళ్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను పలమనేరు పట్టణంలో వెంటనే గుర్తించాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన హాస్టళ్ల నిర్మాణ అంశంపై మున్సిపల్, రెవెన్యూ, విద్యాశాఖా అధికారులతో సమావేశమై చర్చించారు. పీఎం అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన పథకం ద్వారా రూ. 3 కోట్లతో ఎస్సీ బాయ్స్, గర్ల్స్ కాలేజీల ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. అయితే ఈ హాస్టల్‌లో ఏర్పాటు విడివిడిగా నిర్మించాల్సి ఉండడంతో విద్యార్థులకు అనువైన స్థలాలను ఎంపిక చేయాల్సి ఉందన్నారు. అయితే కాలేజీ గర్ల్స్ హాస్టల్ ఏర్పాటు కు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని స్థలాన్ని అధికారులు గుర్తించి ఎలాంటి ఇబ్బందులు లేకుంటే అక్కడే నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాయ్స్ హాస్టల్ నిర్మాణానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి విద్యార్థులకు అసౌ కర్యం లేకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇలా ఉండగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కాలేజ్ బాయ్స్ హాస్టల్ నిర్మాణాన్ని చేపట్టాలని కొందరు సూచించారని అధికారులు ఆయన కు తెలిపారు. డిగ్రీ కళాశాల మైదానం ఎంతో మంది క్రీడా కారులకు, పట్టణ ప్రజలకు ఉపయోగంగా ఉందని, విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తని, ప్రజలకు అసౌకర్యం లేని స్థలాన్ని గుర్తించి ఒకటి రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో తహశీల్దారు ఇన్బనాథన్, మున్సిపల్ కమిషనర్ ఎన్ వి రమణారెడ్డి, డీఈ సురేష్, ఎఈ స్నేహ ప్రియా, టీపీఎస్ ఇందిరా, ప్రభుత్వ డిగ్రీ , జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు వెంకటేశ్వర్లు, కన్నయ్యలతో పాటు టీడీపీ నాయకులు ఆర్‌బిసి కుట్టి, గిరిబాబు, నాగరాజు, ఖాజా, శ్రీధర్, బిఆర్సి కుమార్ పాల్గొన్నారు.


సిహెచ్‌ఓ శ్రీనివాసమూర్తికి ఘన సన్మానం

ప్రజాశక్తి - యాదమరి: పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఏడు సంవత్సరాలుగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిసేసి యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీపై వెళ్లిన శ్రీనివాసమూర్తిని వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక డాక్టర్ ప్రవీణ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సమావేశానికి హాజరైన జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ శ్రీనివాసమూర్తి అంకిత భావంతో ప్రజలకు ఉత్తమ సేవలు అందించారన్నారు. సిబ్బందికి ఎటువంటి సమస్యలు రాకుండా యూనియన్ నాయకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడని తెలిపారు. వైద్యాధికారులు శ్రీనివాసమూర్తి అందరికి అందుబాటులో ఉండి లయన్స్ క్లబ్ ద్వారా పిహెచ్‌సి మీటింగ్ హాలు ఫార్మసీ రూమ్ వైటింగ్ బెంచీలు నిర్మించిఇచ్చారని అతని సేవలు మరువలేమన్నారు. పీహెచ్సీలో లో పనిచేసి బదిలీపై వెళ్లిన నల్గురు ఆరోగ్య కార్యకర్తలు వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, ఎన్జీవో ప్రెసిడెంట్ భానుప్రకాష్, మహేష్, నరసింహప్రసాద్, నూర్జహన్, ధర్మేంద్ర ఎంఎల్‌హెచ్‌వో పిఎస్ ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొబ్బరి సాగులో యాజమాన్య పద్ధతులతో అధిక లాభాలు

ప్రజాశక్తి -కార్వేటినగరం: కొబ్బరి సాగులో యానమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ పీఎస్ సుధాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆర్కేవీబీపేట గ్రామంలోని రైతుసేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శాస్త్రవేత మాట్లాడుతూ కొబ్బరి సాగులో సమగ్ర పోషక యాజమాన్య, సమగ్ర సస్యరక్షణ పద్ధతుల ద్వాడా రైతుకు సాగు ఖర్చు తగ్గి ఆశించిన ఆదాయం వస్తుందని తెలిపారు. పంట దిగుబడి నాణ్యత పెరుగుతుందన్నారు. అనంతరం మండల వ్యవసాయ అధికారిణి హేమలత మాట్లాడుతూ పంట నమోదు రైతులు తప్పనిసరిగా చేసుకోవాలని, నానో యూరియా వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత సుధాకర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

అందరి కృషితోనే మండల అభివృద్ధి: ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి సరిత

ప్రజాశక్తి - ఎస్‌ఆర్ పురం : అధికారులు ప్రజాప్రతినిధులు అందరూ సమిష్టిగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తేనే మండల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ సరిత అన్నారు. శుక్రవారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాఖల వారీగా సమీక్షించారు. పంచాయతీ నిధులు విద్యుత్ బిల్లుల బకాయిలకు కసరత్తు చేస్తున్నామన్నారు. అయితే మండల పంచాయతీలో విద్యుత్ సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. కొత్తపల్లి సర్పంచ్ డిల్లెయ్య సంబంధిత ఏఈని అడిగారు. కొత్తపల్లి పంచాయతీలో ట్యాంక్ కు మెట్ల ఏర్పాటు చేయాలని మండల కో ఆప్షన్ నెంబర్ యేసు రత్నం ఎంపీడీవోకి తెలిపారు. ఎస్‌ఆర్ పురం మండల కేంద్రంలో గత సమావేశంలో ఇచ్చిన అర్జీలకు పరిష్కారం లేదని స్థానిక సర్పంచ్ హరిత కుప్పయ్య అన్నారు. పుల్లూరు బస్సులు పుల్లూరు క్రాస్ నుంచి కాకుండా ఎస్‌ఆర్ పురం బస్టాండ్ వద్దకు వెళ్లి తిరిగి రావాలని సభ్యులు కోరడంతో, దీనిపై ఆర్టీసీ అధికారులు స్పందించాలని తహశీల్దారు లోకనాథ పిళ్లై అధికారిని కోరారు. ఆర్టీసీ బస్సులు మహిళలు ఆపితే ఆపడం లేదని పలువురు సభ్యులు తోపాటు ఎంఈఓ సబర్మతి ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రధానమంత్రి గ్రామీణ యువజన పథకంలో మండలానికి మంజూరైన కోటి 40 లక్షలు రూపాయల పనులకు సంబంధించి నివేదికలను అధికారులు తయారు చేశారు. అన్ని శాఖల అధికారులు తాము చేస్తున్న అభివృద్ధి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రమణ ప్రసాద్ రెడ్డి ఎంపీడీవో మోహన్ మురళి, తాహసిల్దార్ లోకనాద పిళ్ళై , ఎంఈఓ అరుణాచల రెడ్డి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఎం లలిత పశు వైద్యాధికారి శ్రీవిద్య, అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వర్క్ ఫ్రం హోం: ఎంపీడీవో

ప్రజాశక్తి -శాంతిపురం: మండలంలోని మఠం గ్రామ పంచాయతీలో జరుగుతున్న వర్క్ ఫ్రం హోం (కౌసల్యం) సర్వే నమోదు ప్రక్రియను ఎంపిడివో ఎపిఆర్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మండలంలో సుమారు 4,350 మంది వర్క్ ఫ్రం హోం (కౌసల్యం)లో ఇంటి వద్దే పనిచేసుకునేందుకు నమోదు చేసుకున్నారని వీరంత 10వతరగతి అపై విద్యార్హత కలిగివున్నారని, ఇందులో 2,759 మంది వారి ధృవపత్రాలు సమర్పించారని మిగిలిన 1,591 మంది సంబంధిత సచివాలయ సిబ్బందికి ధృవపత్రాలు వెంటనే సమర్పించాలని తెలిపారు. ఇంకా ఎవరైనా నూతన నమోదుకు ఆసక్తి వున్నవారు ధృవపత్రాలు సచివాలయ సిబ్బందికి ఈ నెల 15వ తేదీ లోపు సమర్పించి, నమోదు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశం సద్విని యోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచు మురళి, జయపాల్, పంచాయతీ కార్యదర్శి గౌస్ బాషా, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాసేవకే జీవితం అంకితం: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే థామస్

ప్రజాశక్తి -వెదురుకుప్పం: తన ఊపిరి ఉన్నంతవరకు ప్రజా సేవ చేస్తానని ఎమ్మెల్యే విఎం థామస్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో మహిళా సాధికారిత దిశగా అడుగులు వేస్తోందని ప్రభుత్వ విప్, గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెలుగు కార్యాలయ ఆవరణలో డ్వాక్రా సంఘాలకు ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో రుణాలు పంపిణీ చేశారు. ఆ బ్యాంక్ జిల్లా జెడ్ ఎం భాగ్యరాజ్ హాజరయ్యారు. వెలుగు అధికారి పరుశురాం అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే విఎం థామస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఊపిరి ఉన్నంతవరకు ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేస్తానన్నారు. వారి అభివృద్ధి కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని 3950 డ్వాక్రా సంఘాల మహిళలకు రూ. 61.95 కోట్ల రుణాలు చెక్కులను పంపిణీ చేశారు. మహిళల ఆర్థిక పరిస్థితి మెరుగు పరచడానికి రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా డ్వాక్రా సంఘాలు ఏర్పాటుచేసిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. నియోజకవర్గంలోని 3,950 స్వయం సహాయక సంఘం మహిళలకు రూ.61.95 కోట్ల రూపాయల మెగా చెక్కును ఎమ్మెల్యే తో కలిసి కలిసి అందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు బాబు, నియోజకవర్గంలోని ఆరు మండలాల ఏపీఎంలు, వెదురు కుప్పం క్లస్టర్ ఇన్‌చార్జ్, మోహన్ మురళి, మాంబేడు నీటి పారుదల సంఘం అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

అంతర్ రాష్ట్ర ద్విచక్ర వాహన దొంగలు అరెస్ట్

ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి మూడు లక్షల 50 వేల రూపాయలు విలువ చేసి ఏడు మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని చిత్తూరు టూ టౌన్ సీఐ నెట్టికంటయ్య తెలిపారు. శుక్రవారం చిత్తూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్లో మీడియాలో ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం జనవరి నుండి చిత్తూరు పరిసర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల చోరీల కేసులు అధికంగా నమోదు కావడంతో ఎస్‌పి మణికంఠ చందోలు, డీఎస్పీ సాయినాథ్ ఆదేశాల మేరకు నగరంలో వాహనాల తనిఖీలను వన్‌టౌన్ సీఐ మహేశ్వర, ఎస్ఐ రమేష్ బాబు సిబ్బందితో కలిసి రెండు బృందాలుగా ఏర్పడి మోటార్ సైకిళ్ల దొంగల కేసును ఛేదించారని ఇందులో భాగంగానే శుక్రవారం ఉదయం చిత్తూరు నగరంలోని నూతన కలెక్టరేట్ సమీపంలోని డిఆర్డిఏ కార్యాలయం ఎదుట వాహనాల తనిఖీ చేస్తుండగా పలు కేసులకు సంబంధించిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని వారిని విచారించగా ద్విచక్ర వాహనాలు దొంగలించిన తామేనని ఒప్పుకోవడంతోపాటు ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. ఇందులో ఏ వన్ నిందితుడు జై కుమార్‌తో పాటు లోకనాదాన్ని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. మరో నిందితుడు సయ్యద్ నాశ్రులం పరారీలో ఉన్నాడని తెలిపారు. అతనిని కూడా త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని, నిందితులు చెడు వ్యసనాలకు బానిసలుగా మారి ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారించామని తెలిపారు.

అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): ముసలి మడుగు రిజర్వ్ ఫారెస్ట్ సమీపంలోని నదిలో ఓ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీయగా చనిపోయిన వ్యక్తి పురుషుడని, బట్టతల ..ఎడమ చేతికి వాచ్ ధరించి వున్నాడని తెలిపారు. మెడలో నల్లటి దండ ధరించి వున్నాడని తెలిపారు. గడ్డం వుందని పేర్కొన్నారు. అతనికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే పోలీసులు సంపాదించాలని లేక అర్బన్ పోలీస్ స్టేషన్ 9440796733, 9440796733 ఫోను నెంబర్లను సంప్రదించాలని పోలీసులు సూచించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



చంద్రారెడ్డికి వైసిపి నివాళి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : మండలంలోని కొత్తపల్లి వైసిపి నాయకుడు చంద్రరెడ్డి శుక్రవారం గుండె పోటుతో మరణించారు. చంద్రారెడ్డి మృతదేహానికి చిత్తూరు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎంసి విజయానంద రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. చంద్రారెడ్డి పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈయన కుమారులను, భార్యను పరామర్శించారు. దీంతోపాటు ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, కేపీ శ్రీధర్, చిత్తూరు పార్లమెంట్ కార్యదర్శి విజయబాబు, గోవింద్ రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు చంద్రారెడ్డి, సుధాకర్ రెడ్డి ఎన్ చంద్ర రెడ్డి, పద్మనాభ రెడ్డి, లక్ష్మణ రెడ్డి, మాజీ ఎంపీటీసీ దేవరాజు రెడ్డి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరంజన్ కుటుంబానికి పరామర్శ



ప్రజాశక్తి -ఎస్‌ఆర్ పురం: ఎస్‌ఆర్ పురం మండలంలోని సింధు రాజపురం గ్రామానికి చెందిన నిరంజన్ రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్ అయి మరణించిన తర్వాత అతని అవయవాలను ఏడు గురికి దానం చేసి జీవితాన్నిచ్చారు. అతని కుటుంబాన్ని రాష్ట్ర చీఫ్, గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్, ఎస్ఆర్ పురం మండలం టిడిపి నాయకులు శుక్రవారం పరామర్శించి ఓదార్చారు. పార్టీ కుటుంబానికి అండగా వుంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, బాలాజీ నాయుడు, గంధమనేని రాజశేఖర్ నాయుడు, నిరంజన్ రెడ్డి, పైనేని మురళి, కృష్ణమ నాయుడు, శ్రీధర్ యాదవ్, శ్రీనివాస్ నాయుడు, ఎన్ కుమార్, పుల్లూరు బాబు, వేమానాయుడు, చంద్రబాబు నాయుడు, వెంకటాచలం, చంద్రబాబు రెడ్డి పాల్గొన్నారు.



ఆలయానికి ప్రహరీ నిర్మించాలి

ప్రజాశక్తి-తవణంపల్లి: తవణంపల్లి మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామస్వామి దేవాలయాన్ని ఆధునీకరించాలని ప్రహరీ నిర్మించాలని , లడ్డూ పోటు నిర్మించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ శ్రీహరి జవహర్ లాల్‌ని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ కోరారు. సచివాలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీని శుక్రవారం కలిసి చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం, తవణంపల్లి మండలం , తవణంపల్లి లోని కోదండ రామస్వామి దేవాలయాన్ని ఆధునికరిం చాలని ప్రహరీ గోడ నిర్మించాలని, లడ్డూపోటు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ప్రిన్సిపల్ సెక్రెటరీ కింది స్థాయి సిబ్బందికి వెంటనే ఆదేశాలు ఇచ్చారు. అర్ధగిరి వీరాంజనేయ స్వామి దేవాలయంలో తొలగించిన 16 మంది ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. వీరిని తక్షణం విధుల్లోకి తీసుకునేందుకు తగిన నివేదిక సిద్ధం చేయాలని కింది స్థాయి సిబ్బందికి ఆదేశించారని ఆయన పేర్కొన్నారు.

మంత్రి లోకేష్ కృషి అభినందనీయం: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- కుప్పం :నేపాల్ లో రాజకీయ సంక్షోభం హింసాత్మకం కావడంతో అక్కడ చిక్కుకున్న తెలుగు వాళ్లను సురక్షితంగా తీసుకురావడంలో మంత్రి లోకేష్ కృషి అభినందనీయమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం పేర్కొన్నారు. కుప్పం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం మాట్లాడుతూ.. నేపాల్ లో చిక్కుకున్న 250 మంది తెలుగు వాళ్లను రాష్ట్రానికి సురక్షితంగా తీసుకురావడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. మంత్రి లోకేష్ పరిష్కారం చూపుతున్నారన్నారు. ఈ సమావేశంలో టిటిడి బోర్డ్ సభ్యుడు శాంతారామ్, ఉడా చైర్మన్ డా"సురేష్ బాబు, రెస్కో చైర్మన్ ప్రతాప్, కౌన్సిలర్ జిమ్ దాము, మహిళ నేతలు అనసూయ, సుగుణమ్మ, స్వాతి, నాయకులు సంతోష్, నారాయణ, నరేష్ పాల్గొన్నారు.